# మనసా ఎటులోర్తునో...

## (నవల)

అనురాధ (సుజల గంటి)

**Manasaa Yetulorthuno** - Novel
by **Anuradha (Sujala Ganti)**

First Edition: October, 2016

© Author

For Copies & Address :

**Sujala Ganti**
303, Alekhya Rain Drops
Plot No. 17-18, Gautami Enclave,
Beside Chirec Public school
Kondapur, Hyderabad-500084
Telangana. Ph. No.7702319351/8897599414
sujalaganti@gmail.com

Copies: 500

Book price : Rs. 150/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

DTP & Type Setting:
**Pukkalla Ramakrishna**

*Printed at:*
**Karshak Art Printers,**
Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothivalaboju**
Phone: 80963 10140

& All Major Book Shops

# మనసా ఎటులోర్తునో...

మనిషి జీవితంలో తొలి వలపు ఒక మధురమైన అనుభూతి. జ్ఞాపకాల మాటున కనుమరుగైనా, అప్పుడప్పుడు నేనున్ననంటూ తలుపు తడుతుంది. ప్రేమ ఒక మధురమైన అనుభవం. ప్రేమించే మనసు కలిగి ఉండడం భగవంతుడి సృష్టికి సార్ధకత కలిగించినట్లే. చూసేవారి కళ్ళకు జగమంతా ప్రేమమయం.

ఆమె కళ్ళు ప్రణవ్ కోసం వెతుకుతున్నాయి. క్లాసుకు వెడుతున్నప్పుడు కనబడతాడని ఎదురు చూసింది అక్కడా కనబడలేదు. కాంటీన్‌లో కనబడతాడని ఎదురు చూసింది. అక్కడా కనబడలేదు. ఇంక విసిగిపోయి కాంటీన్‌లో ఒక టేబుల్ దగ్గర కూర్చుంది రవళి. ఫోన్ చెయ్యడానికి బ్యాగ్‌లో నుంచి సెల్ బయటకి తీస్తున్న తరుణంలో ఆమె ఫోన్ రింగయ్యింది.

స్క్రీన్ మీద 'ప్రణవ్ కాలింగ్' అని వచ్చింది. ఆమె మొహంలో సంతోషం. ఫోన్ ఆన్ చేసి చెవి దగ్గర పెట్టుకుంది. "ఏయ్ ఎక్కడున్నావు?" అంటూ అతని కన్నా తనే ముందు సంభాషణ మొదలు పెట్టింది.

"ఫోన్ ఆన్ చేస్తూనే దెబ్బలాట మొదలుపెట్టావా?" అన్నాడు ప్రణవ్.

"నీ కోసం ఎంత ఆత్రుతగా ప్రొద్దుటినించీ వెతుకుతున్నానో తెలుసా? నువ్వు ఏమయిపోయావో అన్న కంగారు. ఒక్కరోజు కూడా నీతో మాట్లాడకుండా ఉండలేనన్న సంగతి తెలుసు కదా!"

"ఒకే బాబా సారీ, నా స్నేహితుడికి సహాయం అవసరం అయి వెళ్ళవలసి వచ్చింది. అందుకే కాలేజీకి రాలేకపోయాను" అన్నాడు.

"సరే నేను కాలేజ్ కేంటీన్‌లో వెయిట్ చేస్తున్నాను. నువ్వు రాగలవా?"

"ఈ రోజు కుదరదు రవళీ రేపు కలుద్దాం. సరేనా... గుడ్ బై" అంటూ ఫోన్ పెట్టేసాడు.

ఈ లోపల ఫ్రెండ్స్ కాంటీన్‌లోకి అడుగుబెట్టారు. కుర్చీ రవళి దగ్గరకు జరుపుకుని కూర్చున్నారు.

"ఏం ఇవ్వాళ ప్రణవ్ దర్శనం అవనట్టుంది. అందుకేనా పొద్దుటినించీ కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నావు?" అంది స్వప్న.

"ఈ రోజు కాలేజ్‌కు రాలేదు. ఫ్రెండ్‌కు సహాయం అవసరం అయి వెళ్ళాల్సి వచ్చిందిట."

"ఎంతసేపూ ప్రణవ్‌ని పట్టుకుని వేళ్ళాడకపోతే  కాస్త మాతో  కూడా సమయం గడపొచ్చు కదమ్మా. మేం కూడా మనుష్యులమే. మేం అందరం మా బాయ్ ఫ్రెండ్స్ చుట్టూనే తిరుగుతున్నామా?" అంది లత.

"బాయ్ కాబట్టి బాయ్ ఫ్రెండ్ అంటే ఫరవాలేదు కానీ ఇంక వేరే మీనింగ్‌లతో అయితే మాత్రం బాయ్ ఫ్రెండ్ అనొద్దు. మీతో ఎప్పుడూ సమయం గడపనట్లు మాట్లాడుతున్నారేమిటి? ప్రణవ్ నా భావాల్ని తొందరగా అర్థం చేసుకుంటాడు. అంతకన్నా ఏమీ లేదు" అంది రవళి.

"ఎందుకర్రా దాన్ని అనవసరంగా ఆట పట్టిస్తున్నారు" అంది కీర్తన. కాస్త అందరిలోకీ సరళ స్వభావురాలు. ఎక్కడైనా వాదన మొదలవుతోందంటే చిలికి చిలికి గాలివాన అవుతుందని, తన మాటలతో ఆపడానికి ప్రయత్నిస్తుంది. అందుకే ఫ్రెండ్స్ అందరూ తనకి  'చల్లనీళ్ళు' అన్న ముద్దు పేరు పెట్టారు. కీర్తన రాగానే 'చల్లనీళ్లు వచ్చాయి ఇంక మంటలార్పబడును' అన్న డైలాగ్ ఎవరో ఒకరు అంటారు. ఆ విషయం విని చిరునవ్వు నవ్వి ఊరుకుంటుంది కీర్తన.

"నీకలా పిలిస్తే కోపం రాదా!"

"ఇందులో కోపానికేముంది? అందరం  సరదాగా ఉంటున్నాము. మన మధ్య స్నేహం ఉంది కాబట్టే ఆ చనువు. ఈ  నిక్‌నేమ్స్, మన ఈ అల్లరి పనులు కాలేజ్లో ఉన్నప్పుడు మనలో ఒక ఉత్సాహాన్ని నింపుతాయి. ఆ తరువాత ఇవన్నీ ఒక తీపి జ్ఞాపకంలా మిగిలిపోతాయి" అంటుంది కీర్తన.

"సరే టైమ్ అవుతోంది ఇంటికి బయలుదేరదాం. నువ్వింకా కుర్చుంటావా రవళీ" అంది లత.

"లేదు నేను కూడా వెడదామని అనుకునే సమయానికి మీరు వచ్చారు" అంటూ లేచింది.

అందరూ లేచి ఇళ్ళకు వెళ్ళడానికి ఆయత్తమయ్యారు. రవళి మాత్రం మనసులో ఇంక ఈ రోజుకు ప్రణవ్‌ని కలవడం కుదరదని కొంచెం బాధపడింది. ప్రణవ్‌తో కలవని రోజు నిరుత్సాహం చోటు చేసుకుంటుంది. మిగిలిన స్నేహితుల కన్నా ప్రణవ్ సమక్షంలో ఎక్కువ ఆనందాన్ని పొందగలుగుతుంది.

రవళి, ప్రణవ్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్. రవళి సెకండియర్, ప్రణవ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజ్ అది. రాగింగ్‌లో ఎదురుపడిన రవళి పట్ల తెలియకుండానే ఆకర్షితుడయ్యాడు ప్రణవ్. చక్కని కనుముక్కు తీరుతో తుమ్మెదల్లాంటి ఉంగరాల జుట్టు, ఆకర్షణీయమైన అందమైన కళ్ళు 'విశాలాక్షి' అన్న పేరు సరిగ్గా సరిపోయేటట్లున్న ఆ మనోహరమైన కళ్ళు సూటిగా ఎదుటి మనిషిని ఆకర్షించగలవు.

ముందు పెద్దగా అతన్ని ఇష్టపడకపోయినా క్రమేపీ అతనిలోని సరళత్వాన్ని, తోటిమనిషి పట్ల చూపించే సద్భావన, ప్రతీ ఆడపిల్లా ఇష్టపడే అతని రూపం పట్ల ఆకర్షితురాలవకుండా ఉండలేకపోయింది.

ఆ ఆకర్షణ పెరిగి, ఇప్పుడు ఒక రోజుకన్నా ఎక్కువ అతన్ని చూడకుండా ఉండలేదు. వారిద్దరి మధ్య ఉన్నది ప్రేమో, ఆకర్షణో తెలియని స్థితిలో ఉన్నారు. ఒకరంటే ఒకరికి ఇష్టం. ఇద్దరి అభిరుచులు కలవడం, పరస్పర సాంగత్యంలో ఆనందం అన్నీ ఉన్నాయి. వారిద్దరూ మంచి స్నేహితులా! ప్రేమికులా! కాలమే నిర్ణయించాలి.

నిరాశతో ఇంక ఇంటి ముఖం పట్టింది. కాలేజ్ ఆవరణలో ఉన్న తన స్కూటీ దగ్గరకు అడుగులు వేసింది. దారిలో కనిపించిన స్నేహితురాలు డల్‌గా ఉన్న రవళిని చూసి "ఎనీ ప్రాబ్లెమ్" అంటూ పలకరించింది.

గలగల సెలయేరులా ఎప్పుడూ నవ్వుతూ ఉండే రవళి అలా దిగాలుగా ఉండడంతో ఆ అమ్మాయి నోటి వెంట ఆ ప్రశ్న వచ్చింది. పక్కనే ఉన్న ఇంకో స్నేహితురాలు "అదేం కాదు. ఈ రోజు ప్రణవ్ కాలేజ్‌కు వచ్చుండడు" అంది.

స్నేహితుల ముందు బైటపడడం ఇష్టంలేక "అదేం కాదు కాస్త తల నొప్పిగా ఉంది" అంటూ స్కూటీ స్టార్ట్ చేసింది.

అదృష్టవశాత్తు ట్రాఫిక్ ఎక్కువ లేదు. అందుకే తొందరగా ఇంటికి చేరగలిగింది. స్కూటీ ఇంటి ముందు ఆపి గేట్ తీసుకుని లోపలికి వెళ్ళింది. స్కూటీ పార్క్ చేసి, లాక్ చేసింది. ఇంటికి రాగానే బైటి వాతావరణాన్ని వదిలేయాలని ఆ ఇంట్లో రూల్. అది అందరూ పాటించాలి. అందరూ అంటే ఆ ఇంట్లో చాలామంది లేరు. అమ్మా, నాన్నా, ఒక అమ్మాయి అంతే.

'మేడంటే మేడా కాదు గూడంటే గూడూ కాదూ, పదిలంగా అల్లుకున్న పొదరిల్లూ మాదీ' అన్న పాటలోని అందమైన పొదరిల్లు.

గుమ్మం ముందు ఆగి తన తాళం చెవితో తలుపు తీసుకుని లోపలికి అడుగు బెట్టింది. తల్లి పనిలో ఉన్నా, పడుకున్నా డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక అప్పుడప్పుడు అలా చేస్తూ ఉంటుంది. ఎక్కడా అలికిడి లేదు. తల్లి ఇంట్లో ఉందా, లేదా అన్న అనుమానం వచ్చింది.

ఇల్లంతా వెతికి మంచం మీద పడుకున్న తల్లిని చూసి కంగారుపడింది. తల్లి మంచం మీద పడుకోవడం ఎప్పుడూ ఎరగని రవళికి ఆందోళన కలిగింది. ఎప్పుడూ చురుకుగా ఏదో పని చేస్తూ ఉండే తల్లి అలా మంచం మీద ఉండడం ఇన్నాళ్ళల్లో ఎప్పుడూ జరగలేదు. కాస్త మామూలు జ్వరం, పడిశంలాంటి విషయాలకు పెద్ద పట్టించుకోదు మానస.

ఇల్లు తీర్చిదిద్దడంలో ఆమె ఒక కళాకారిణి. 'ఇల్లు చూసి ఇల్లాలిని చూడు' అన్న సూక్తి ఆమె పట్ల పూర్తి నిజం.

ఎప్పుడూ చెరగని చిరునవ్వు ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. సన్నగా, నాజూగ్గా టీనేజ్ అమ్మాయికి తల్లిగా కాకుండా తానే టీనేజ్ అమ్మాయిలా కనపడుతుంది. భర్త అప్పుడప్పుడు వేళాకోళం చేస్తాడు "ఏంటోయ్ అమృతం కానీ తాగావా?" అని.

ఉద్యోగం చెయ్యని ఆడవాళ్ళకు ఏం పని హాయిగా ఇంట్లో కూర్చుని టీవీ ముందు గంటలు గంటలు గడుపుతారు. లేకపోతే ఇరుగమ్మ పొరుగమ్మలతో కబుర్లు చెప్పుకుంటారన్న వేళాకోళాలు చాలా మందిచేస్తూ ఉంటారు. అసలు నిజం చెప్పాలంటే ఇంట్లో ఉన్న ఆడదానికి పనెక్కువ.

ఏ సందర్భం వచ్చినా పిల్లలు, భర్తా కూడా నువ్వింట్లోనే ఉంటావు కదా ఈ పని చేసేయ్ అని ఆర్డర్ వేస్తారు. పోనీ అని చేసినా గుర్తింపు ఉండదు. జీతం బత్తెం అసలుండదు. చాలా ఇళ్ళల్లో ఫ్రీ పని మనిషి.

దీనికి విరుద్ధం మానస ఇంట్లో. ఆమె ఇంట్లో కూర్చున్నా చాలా విషయాల్లో ఆమెకు అభిరుచి ఉండబట్టి ఇంటిని చాలా చక్కగా కళాత్మకంగా తీర్చిదిద్దింది. రవళి చిన్నప్పుడు ఆమె ఫ్రాక్‌లు అన్నీ తానే కుట్టేది. కుట్టిన ఫ్రాక్ రవళికి వేసి మురిసిపోయేది. రవళి కొంచెం పెద్దయ్యాక రెడీమేడ్ కొనడం మొదలుపెట్టింది. మిగిలిన పిల్లలందరూ రెడీమేడ్ వేసుకుని తన కూతురు వేసుకోకపోతే పెద్దయ్యాక ఆ అనుభవం తనకు దొరకలేదన్న భావం ఆమెలో తలెత్తకూడదని ఉద్దేశం.

చక్కని సంగీతం వినడం ఆమె అభిరుచి. సంగీతం మనసుకు ఉల్లాసం ఇస్తుంది. పనిలో శ్రమను తెలియనివ్వదు. రవళికి పెద్దగా సంగీతం పట్ల అభిరుచి లేదు. అందరి పిల్లల్లాగా పాస్ట్ మ్యూజిక్ ఇష్టపడుతుంది.

మానస ఏ పని చేసినా మహీధర్‌కు  చాలా ఇష్టం. మానస చేసే పనులు అందరికీ చెప్పుకోవడం అతనికి గొప్ప. ఇంట్లోనే ఉండి ఆమె చేసే పొదుపు ఏ ఉద్యోగం చేసే ఆడదాని కన్నా తక్కువ కాదన్న భావం. అందరి మగాళ్ళకూ ఈ భావమే ఉంటే ఎంత బాగుంటుందో కదా!

"అమ్మా" అంటూ పక్క మీద కూర్చుని తల మీద చెయ్యి వేసింది. కూతురి స్పర్శకు కళ్ళు తెరిచిన మానస చిన్నగా నవ్వి, " ఏం లేదురా అలసటగా ఉంటే పడుకున్నాను. అంత కన్నా ఏమీ లేదు" అంటూ లేవబోయింది.

"నువ్వు పడుకో అమ్మా నేను పని చేస్తాలే" అంటూ లేవబోయిన తల్లిని అడ్డుకుంది.

కూతురి చెయ్యి పట్టుకుని అపురూపంగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ "ఇప్పుడు నాకు ఏమయ్యిందిరా బంగారూ! కాస్త అలసటే కదా! నువ్వు బట్టలు మార్చుకుని రా. నేను నీ కోసం టీ పెట్టి సాయంకాలం వంట చేస్తాను. నాన్నగారు కూడా వచ్చే వేళ అయ్యింది" అంటూ లేచింది.

తల్లి తన మాట వినదని నిశ్చయించుకుని, బట్టలు మార్చుకుందుకు తన రూమ్‌లోకి  వెళ్ళింది.

మానస మెల్లిగా లేచి వంటింట్లోకి వెళ్ళింది. కూతురికి, తనకీ టీ పెట్టి, 'ఎందుకో ఈ మధ్య నీరసంగా ఉంటోంది ఒకసారి డాక్టర్ దగ్గరకి  వెళ్ళి నీరసానికి మందులు తెచ్చుకోవాలి' అనుకుంది.

రవళి బట్టలు మార్చుకుని వచ్చి కిచెన్ గట్టు మీద ఉన్న టీ కప్పులు చూసి

"రా అమ్మా ఇద్దరం కూర్చుని సరదాగా టీ తాగుదాం. వంటకు నేను కూడా సహాయం చేస్తాను" అంటూ రెండు టీ కప్పులూ తీసుకుని డైనింగ్ రూమ్‌లోకి నడిచింది. ఫ్రిజ్‌లోంచి వంటకు కూరగాయలు తీస్తున్న మానస ఆ పని మానేసి, కూతురి వెనక నడిచింది. టీ తాగుతూ ఆ రోజు కాలేజీ కబుర్లు చెపుతూ ఉంటే వింటోంది మానస.

ఆ తల్లీకూతుర్ల మధ్య అరమరికలు లేవు. టీనేజ్‌లో ఉన్న కూతుర్ని ఒక స్నేహితురాలిగా చూస్తుంది మానస. అందుకే తల్లి అంటే మరీ మరీ ఇష్టం రవళికి. చిన్నప్పట్నించీ అన్ని విషయాలు తనతో పంచుకునేటట్లుగా చేసింది. తల్లిగా జాగ్రత్తలు చెప్పినా, శాసనాలు చేసినా అది ప్రేమతో తప్ప దండనలా కాకుండా ఉండేది.

వాళ్ళిద్దరూ తల్లీకూతుళ్ళే కాకుండా మంచి స్నేహితులు  కూడా. రవళి గలగలా కబుర్లు చెపుతుంటే వింటున్న చెల్లెల్ని అన్నగార్లు వేళాకోళం చేసేవారు "మా మానస వాళ్ళమ్మాయి మాటలు ఎన్ని గంటలైనా విసుగు లేకుండా వినగలదు" అంటూ ఆ మాటలకు చిరునవ్వే సమాధానం ఇచ్చేది మానస.

"నీకీ రోజు వంట్లో బాగుండలేదు కదా వంట నేను చేస్తాను" అంది రవళి. "ఫరవాలేదు. మన ముగ్గురికి వంటచెయ్యడం పెద్ద కష్టం కాదు కదా! నువ్వు చెప్పు ఇవ్వాళ కాలేజీ విశేషాలు ఏమిటి" అంది మానస.

"పెద్దగా విశేషాలేం లేవు. ఇవ్వాళ క్లాసులు కూడా ఎక్కువ లేవేమో కొంచెం బోర్ అనిపించింది. కాంటీన్‌లో కూర్చుంటే ఫ్రెండ్స్ వచ్చారు. కబుర్లుఅయ్యాక ఇంటికి బయలుదేరాము" అంది రవళి.

రవళికి చిన్నప్పట్నించీ మానసే చదువు చెప్పేది. రవళి కోసం చేసే ప్రతీ పనిలో ఎంతో ఆనందం అనుభవించేది మానస. అమ్మలందరూ ఇలాగే ఉంటారన్నట్లుగా ప్రవర్తించేది. అందుకే స్నేహితుల దగ్గర ఎప్పుడైనా మా అమ్మ ఇలా చేస్తుంది, అలా చేస్తుంది అని చెపితే రవళి స్నేహితులు "యు ఆర్ సో లక్కీ" అనేవారు.

అప్పటిదాకా అమ్మలందరూ అలాగే ఉంటారనుకున్న రవళికి తన తల్లి ఏదో స్పెషల్ అన్న విషయం అర్ధమయ్యింది. ఇంకో బిడ్డ ఉంటేనైనా కనీసం మానస ధ్యాస ఆ బిడ్డమీద మళ్ళేదేమో! అప్పుడు దారి ఇంకోలా ఉండి ఉండేది.

మానసకు ఫ్లాట్ అంటే పెద్ద ఇష్టం ఉండదు. ఇల్లు విశాలంగా ఉండి చుట్టూ తోట ఉండాలన్నది ఆమె కోరిక అందుకని సిటీకి దూరంగా స్థలం కొని మంచి ఆర్కిటెక్ట్ సహాయంతో ఇల్లు కట్టించాడు మహీధర్, మానస భర్త. ఇల్లు ఆమె అభిరుచులకు తగ్గట్టుగా తీర్చిదిద్దుకుంది. ఆమె అభిరుచులను భర్త, కూతురూ కూడా గౌరవిస్తారు.

మనుష్యుల్లో వివిధ మనస్తత్వాలు. ఏ ఒక్కరి మనస్తత్వం ఒకలా ఉండదు. కొంతమందికి అందరిలో సరదాగా కలిసిపోవడం ఇష్టమైతే, కొందరికి తమ మనసుకు నచ్చిన వాళ్ళు దొరికినప్పుడే స్నేహం చెయ్యడానికిష్టపడతారు. మరికొందరు ఒంటరిగా ఉండడానికిష్టపడతారు.

మానస రెండవ తెగకు చెందుతుంది. అందరితో సరదాగా మాట్లాడుతుంది కానీ తన మనసుకు, తన ఆలోచనా విధానానికీ దగ్గరగాఉన్న వాళ్ళతోనే స్నేహం కలుపుతుంది. ఈ కారణంగా ఆమెకు స్నేహితులు తక్కువనే చెప్పవచ్చు.

పుస్తకాలు ఆమెకు మంచి మిత్రులు. పుస్తకాలు మిత్రులైనప్పుడు భేదభావాల ప్రసక్తి ఉండదు. పైగా మనోవికాసం కూడా.

❖ ❖ ❖

అది ఒక ఒక అందమైన పల్లెటూరు. ఆ ఊర్లోకి అడుగుబెట్టాలంటే దారిలో కనిపించే ప్రకృతి సౌందర్యాన్ని పరవశంగా చూస్తూ, పచ్చని పంటచేలు కనులకు విందు చేస్తుంటే, గోపబాలుడు మేపుతున్న పశువుల మందలూ, అందులోని లేగదూడ వేసే చిందులూ అన్నీ మనసు నిండా నింపుకుంటూ ఊళ్ళోకి అడుగుబెట్టవచ్చు.

ఊరి మొగలోకి రాగానే ఆ ఊరు వచ్చిన వారిని తెలియని కొత్తవారైతే 'ఎవరింటికండీ" అని అడిగి వారింటి కెళ్ళే దారిచెప్పడం. తెలిసినవారైతే ఆ వచ్చిన వారిని కుశల ప్రశ్నలు వెయ్యడం ఆనవాయితీ. ఆ ఊరి కొచ్చిన చుట్టం అందరి చుట్టంలా ఆప్యాయతను పంచే సాంప్రదాయం గల ఊరది.

అలాంటి అందమైన ఊర్లో మానస పుట్టింది. అందమైన పంట పొలాలు, పచ్చని చెట్లు. గ్రామం మధ్యలో అందమైన చెరువు. అరటి తోటలు, కొబ్బరి తోటలు, ఎత్తైన అరుగుల ఇళ్ళు. అరుగుల మీద కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుతూ, వీధిలో పోయే వాళ్ళను పలకరించే పెద్దవాళ్ళూ, ఉన్న ఆప్యాయతలకు ఆలవాలమైన ఊరది.

మానస తండ్రి ఆ ఊళ్ళో పెద్ద భూకామందు. ఆయన మాటకు చాలా గౌరవం ఉంది ఆ ఊళ్ళో. చాలాసార్లు ఊరి ప్రెసిడెంట్‌గా చెయ్యమంటే ఆయన ఒప్పుకోలేదు. 'రాజకీయాలు నా ఒంటికి పడవు. ఊరి బాగు కోసం మాత్రం ఎప్పుడు ఏం కావాలన్నా నేను ముందు ఉంటాను' అంటారాయన.

వారిది చాలా రోజులు ఉమ్మడి కుటుంబం. ఇద్దరన్నదమ్ములూ కలిసే ఉండేవారు. తమ్ముడికి అన్నగారెంత చెప్తే అంతే. కానీ అది చాలా రోజులు సాగలేదు. అన్నదమ్ములు విడిపోయారు. ఆస్థులు పంచుకున్నారు.

ప్రతీ పల్లెటూరిలాగే అందమైన చెరువు. చెరువు నిండా కలువ పూవులు. పూలతో నిండిన చెరువులో మోకాలి నీటిలోకి దిగి కలువపూలు కోసుకోవడానికి ఆడపిల్లలు పోటీపడుతూ ఉంటారు. పాకుడుకి జారతారేమో అని ఒకరికొకరు సాయం. అందరిలోకీ సుందరి మాత్రం కొంచెం ముందుకు వచ్చేది.

"దీనికి మరీ అన్నీ మగరాయుడి లక్షణాలే బాబూ" అని స్నేహితురాళ్ళు వెక్కిరించేవారు. కానీ సుందరి లేకపోతే వాళ్ళ జట్టు చిన్నబోయేది. అన్ని పనులకు నేనున్నానమ్మా అన్నట్లు ముందుకు వచ్చేది. ఆటలు కూడా అన్నీ మగపిల్లలు ఆడేవే ఆడేది.

పైగా ఎవరైనా వెక్కిరిస్తే "ఏం ఇవి మగపిల్లల ఆటలని దాని మీద ఎవరైనా రాసారా!. మనం వాళ్ళతో పోలిస్తే దేంట్లో తక్కువ" అని వాదించేది. సుందరి ఉన్నప్పుడు తనతోబాటు  బిల్లంగోడు, కబడ్డీ కూడా ఆడేవారు. వాళ్ళ అమ్మ అడిగినా ఎందుకు ఆడకూడదని వాదించేది.

ఈడొచ్చి కందువాలు వేసుకోవడం మొదలుపెట్టాక వీళ్ల ఆటలు కొంత తగ్గించారు. మనసులో ఆడుకోవాలని ఉన్నా పెద్దవాళ్ళ భయం వాళ్ళను ఆపింది. వామనగుంటలు, తొక్కుడు బిళ్ళ అప్పుడప్పుడు ఆడేవారు. క్లాసులు పెరిగి చదువులు పెరిగాక ఆటలు కూడా తగ్గాయి.

సుందరి మాత్రం ఎప్పుడైనా మగ పిల్లలు క్రికెట్ ఆడుతున్నప్పుడు వాళ్ళ ఆట ఆడ్డం చూసి నేర్చుకుని "మనం ఆడపిల్లలం కూడా ఆడదామ"ని అనేది. కానీ చాలా మంది పిల్లల్లో ఇంట్లో ఏమైనా అంటారని భయం.

"మనం ఆడుతుంటే మన వెనక నిలబడి చూస్తున్నట్లుగా భయపడతారేమిటే మరీనూ కాస్సేపు ఆడితే కొంపలేం అంటుకుపోతాయి?" అంటూ వాదించి వాళ్ళను

బలవంతంగా ఆడేటట్లు చేసేది. ఆమె లీడర్‌షిప్‌లో క్రికెట్ ఆడడం కూడా జరిగేది. బాల్యస్మృతులు ఎప్పటికీ చెరిగిపోని తిరిగిరాని అందమైన జ్ఞాపకాలు. అందుకే బాల్యాన్ని బంగారు బాల్యం అంటారు. భేషజాలు, కల్మషాలు ఎరుగని జీవితం.

ఊళ్ళో చెరువు పక్కన పొగడ పూల చెట్టు. కొంతమంది ఆడపిల్లలు రాలిన పొగడపూలు ఏరుకోవడం వాటిని వాసన చూస్తూ, మాలలు గుచ్చడం పెద్ద వాళ్ళెవరైనా చూసి, "అలా వాసన చూడడం తప్పర్రా, వాసన చూసిన పూలు దేముడికి పనికి రావు" అని కేకలెయ్యడం జరిగేది.

అందుకే పెద్దవాళ్ళు చూడనప్పుడు వాసన చూడడం, చూసినప్పుడు మానేయడం . పోటీల మీద దేముడి కోసం మాలలు గుచ్చడం, ఆ ఊరి ఆడపిల్లలకు అలవాటు. మాలలన్నీ గుచ్చాక వేణు గోపాలస్వామి ఆలయంలోకి వెళ్ళి ఆ మాలలు పూజారిగారికి ఇవ్వడం, దేముడికి నా మాల వెయ్యాలంటే, నా మాల అని గొడవ పెట్టడం రోజూ జరుగుతుంటే పూజారిగారు నవ్వుతూ 'అందరి మాలలూ వేసి, మీ అందరికీ మంచి మొగుళ్ళు రావాలని ఆ వేణుగోపాలుడ్ని కోరుతాను' అనేవారు.

ఆ మాటతో అందరూ సిగ్గుతో పారిపోయేవారు. పెళ్ళి మాట ఎత్తగానే ఆడపిల్లకు ఎక్కడి లేని సిగ్గొ వస్తుంది. పల్లెటూళ్ళో ఆడపిల్లలకు ఆటవిడుపు ఎక్కువగా దేవాలయం వెళ్ళడమే. పొద్దున స్కూల్ హడావుడి కాబట్టి సాయంకాలం చెరువుగట్టు కానీ గుడికి కానీ వెళ్ళేవారు. కొంత మంది ఆటలు, కొంత మంది దేముడి గుడికి వెళ్ళడం చేసేవారు.

అలాంటి అందమైన వాతావరణంలో ముద్దమందారంలా పెరిగింది మానస. జయలక్ష్మి, పరంధామయ్యగార్ల ముద్దుల పట్టి, నలుగురన్నగార్లకు ముద్దుల చెల్లెలు. వాళ్ళ వంశంలో ఆడపిల్లలు తక్కువ. అందుకే ఆడపిల్లను మహాలక్ష్మిలా భావించి అపురూపంగా చూసుకుంటారు.

పరంధామయ్యగారికే కాకుండా ఆయన తమ్ముడు సీతారామయ్యగారికి కూడా ఆడపిల్లలు లేరు. పరంధామయ్యగారికి ఇద్దరు మగపిల్లలు పుట్టాక తమ్ముడికి పెళ్ళయ్యింది. తమ్ముడి పెళ్ళయ్యాక వరుసగా మరో ఇద్దరు మగపిల్లలు పుట్టారు. తమ్ముడు సీతారామయ్యకు కూడా మగపిల్లలే. అన్నలాగా తనకు కూడా ఆడపిల్ల ప్రాప్తం లేదనుకున్న సమయంలో వాళ్ళ జీవితాల్లో వెలుగు నింపడానికన్నట్లు పరంధామయ్యగారికి నలుగురు తరువాత మానస పుట్టింది.

పరంధామయ్యగారు విష్ణు భక్తుడు. అందుకని పిల్లలకు కేశవ, నారాయణ, మాధవ, గోవింద్ అని పేర్లు పెట్టారు. అన్నగారి అడుగుజాడల్లో కాకపోయినా పెద్దవాడికి అచ్యుత్ అని, రెండవవాడికి అభిషేక్ అని పేరు పెట్టారు సీతారామయ్య.

గోవింద్ ఏడేళ్ళ వాడయ్యాక మానస పుట్టింది. మానస రాక ఆ ఇంట కోటి వెలుగులు తెచ్చిందనే చెప్పాలి. ఆడపిల్లలు తమ వంశంలో తక్కువ. తమ్ముడికి కూడా ఇద్దరూ మగపిల్లలవ్వడంతో తమకైనా ఒక ఆడపిల్లనివ్వమని ఎన్నో దేవుళ్ళకు మొక్కుకున్నారు. వాళ్ళ నోములు ఫలించి దేముడు మానసను వాళ్ళకిచ్చాడు.

చిన్నారి మానస ఏంచేసినా అపురూపమే. మానస కాస్త ఏడుపు మొదలు పెట్టగానే అన్నలు నలుగురూ పరుగెట్టుకుని వచ్చేవారు. అందులో పెద్దవాళ్ళు కేశవ, నారాయణ మినహాయింపు. కేశవకు మానసకు పధ్నాలుగేళ్ళ వారా ఉంది. నారాయణ కేశవకన్నా రెండేళ్ళు చిన్న. పరుగెట్టుకెళ్ళి జయలక్ష్మిగార్ని లాక్కొచ్చేవారు. ఆవిడకూ ఆడపిల్ల అపురూపమైనా కొడుకుల ప్రేమ చూసి ముద్దుగా విసుక్కుంటూ ప్రపంచంలో మీ ఒక్కరికే చెల్లి ఉన్నట్లు ఏమిటర్రా ఈ హడావుడి? మీ చెల్లెల్ని అస్సలు  కొంచెం కూడా ఏడవనివ్వరా?" అంటే,

"ఊహూ, అస్సలు ఏడవనివ్వం అది మా బంగారు" అనేవారు.

చిన్న మానస పెరిగి పెద్దదవుతోంది. ఆమె చేసే ప్రతీ చేష్ట ఆ ఇంట అపురూపమే. నడక వచ్చి పరుగులు పెట్టి పెరడంతా తిప్పేది.

ఇద్దరు తల్లుల మధ్య చిన్ని కృష్ణుడిలా ముద్దుగా పెరిగింది. తోటికోడళ్ళిద్దరి మధ్యా సఖ్యత బాగానే ఉండేది. జయలక్ష్మిగారు తోటికోడల్ని సొంతచెల్లెల్లా చూసుకునేది. వైదేహి కూడా అక్క జయలక్ష్మిగారిలో తన సొంత అక్కనే చూసుకునేది

అన్నలను, ముద్దుగా "పట్టుకో" అంటూ పరిగెడితే వేగంగా పరిగెట్టి పట్టుకోగలిగినా ఆమెను గెలిపించడానికి ఓడిపోయేవారు అన్నలు. గోవింద్ మరీను, చెల్లెలితో బాటు తనూ గోరింటాకు పెట్టుకునేవాడు. ఒకసారి మానస పూలజడ వేసుకుంటే తాను కూడా పూలజడ వేసుకుంటానన్నాడు. తప్పు మగపిల్లలు వేసుకోరంటే అప్పుడు ఊరుకున్నాడు.

మానస పూలజడ వేసుకుంటే ఆమెకు బరువుగా ఉంటుందని ఆమె జడ ఎత్తి పట్టుకుని వెనక నడిచేవారు అన్నలు. చుట్టుపక్కల వాళ్ళు ఎగతాళి చేస్తే

'మా చెల్లి మా ఇష్టం' అంటూ ముక్కు తుడుచుకుంటూ చెప్పేవాడు గోవింద్.

మాధవ, గోవింద్, అచ్యుత్, అభిషేక్ నలుగురూ వెనక నడుస్తుంటే మహారాణీ లాగా నడిచేది మానస, గారాల చెల్లి.

భారతదేశంలో ఏ ప్రాంతం వారికైనా వ్యవసాయదారుడికి సంక్రాంతి పెద్ద పండగ. నేపాల్లో కూడా సంక్రాంతి పండగ చేసుకునే సాంప్రదాయం ఉంది. ఇంకా కొన్ని దేశాల్లో వివిధ నామాలతో ఈ పండుగను జరుపుకుంటారు

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన శుభ సందర్భానా, ధాన్యలక్ష్మి ఇంటికి వచ్చిన సందర్భాన్ని పండగలా జరుపుకుంటారు. సంక్రాంతినాడు సూర్యుడు మకరరేఖలోకి అడుగుబెడతాడు. అందుకే మకర సంక్రాంతి అంటారు. ఈ రోజునించే ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుంది.

ఈ పండగ సూర్యుడు చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో జరిగే మార్పు మీద ఆధారపడింది కాబట్టి ఏ రోజు మకరరేఖలోకి అడుగుబెడతాడో ఆ రోజునే పండగ జరుపుకోవడం ఆనవాయితీ. కొద్ది సంవత్సరాల క్రితం ఈ పండగ డిసెంబరు 31న వచ్చేదని కాలక్రమేణా అది జనవరి 14కు మారిందని... 2050 నాటికి ఇది జనవరి 15కు మారుతుందని శాస్త్రజ్ఞుల అంచనా.

అస్సామ్‌లో బొగాలీ బిహూ అంటారు. బిహూ అంటే పండగ. ఆడపిల్లలు అందంగా అలంకరించుకుని ఆ పండగ యొక్క విశిష్టతను తెలుపుతూ పాటలు పాడుతూ నాట్యం చేస్తారు.

తమిళ దేశంలో పొంగల్‌గాను, ఉత్తరాన సంక్రాత్‌గాను ఈ పండగను చేసుకుంటారు. సూర్య గమనాన్ని తెలిపే ఈ పండగ, ఆ ప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఉత్తరాన భోగి ముందు రోజు రాత్రి భోగిమంట వేసి అగ్నిలో నువ్వులు, వేరు శనగకాయలు వేసి చుట్టూ తిరుగుతూ రకరకాల పాటలు పాడతారు. దీన్ని కిచిడీ సంక్రాంతి అంటారు.

పంజాబ్‌లో లోడి (భోగి) అంటారు. భోగిముందు రోజు రాత్రే భోగి మంట వేస్తారు. ఎవరింట్లైనా మగబిడ్డ పుడితే ఆ ఏడాది వాళ్ళింట ఆ లోడీ పెద్ద పండగగా చేస్తారు. వాళ్ళవాళ్ళ తాహతుని బట్టి బంధువులను పిలిచి భోజనాలు, భోగి మంట వెయ్యడం దాని చుట్టూ తిరుగుతూ పాటలు, నాట్యం అన్నీ చేస్తారు.

పండగ సంబరాలన్నీ పల్లెల్లోనే. సంస్కృతికి ఆయువు పట్టు పల్లెలు. వాకిళ్ళల్లో అందంగా కళ్ళాపి చల్లి అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దడం కళ్ళకెంతో ఇంపుగా ఉంటుంది. కళ్ళాపి చల్లిన నేల పచ్చదనం దాని పైన తెల్లని రంగవల్లి భూమాత అందాలను ద్విగుణీకృతం చేస్తుంది.

పరంధామయ్యగారి ఇల్లు కూడా సంక్రాంతి వచ్చిందంటే పండగ ముస్తాబు చేసుకుంటుంది. గుమ్మాలకు పచ్చని మామిడి తోరణాలు, వాకిట్లో కళ్ళాపి చల్లి అందమైన రంగవల్లులు తీర్చిదిద్దేవారు. పాలేళ్ళు తెల్లవారు ఝామున వెలిగించడానికి వీలుగా భోగి మంటకు అన్నీ తయారు చేసేవారు.

తెల్లవారు ఝామున లేచి ఇంటిల్లిపాదీ భోగిమంట వెలిగించి మంట దగ్గర చిరుచలి కాచుకుంటూ కూర్చునేవారు. ఇంట్లో ఉన్న చిన్న పిల్లలకు మెడలో పిడకలమాల వేసి మంట చుట్టూ ప్రదక్షిణ చేసాక ఆ మాల మంటలో వేసేవారు. అలా చేస్తే పీడ, దిష్టిపోతాయన్న నమ్మకం. ఆ తరువాత ఇంటిల్లీపాదీ నూనె రాసుకుని నలుగు పెట్టుకుని తలంటు పోసుకుని కొత్త బట్టలు కట్టుకునేవారు.

పనివాళ్ళకు సంవత్సరానికి సరిపడ ధాన్యం కొలవడమే కాక ఆ రోజు చేసిన పిండివంటలు వాళ్ళకు కూడా పంచేవారు జయలక్ష్మిగారు. అందుకే ఆమెను అన్నపూర్ణమ్మ తల్లి అనేవారు. ఈ పనులన్నింటిలోనూ వైదేహి తోటికోడలికి కుడి భుజంలాగా ఉండేది.

మానస పుట్టాక వారింట సంక్రాంతి ఇంకా పెద్ద పండగగా పరిణమించింది. ఆమెకు భోగిపళ్ళు పోయడం ఒక పెద్ద కార్యక్రమం. రెండురోజుల ముందే ఊరందర్నీ పేరంటానికి పిలిచేవారు. చిన్నారి మానసకు పట్టుపరికిణీ, చిన్న వడ్డాణం, మెడలో పతకం, అన్నీ వేసి అందంగా తయారు చేసి మురిసిపోయేవారు జయలక్ష్మిగారు, వైదేహి. మానసలోనే తన కూతుర్ని చూసుకునేది వైదేహి.

ఆమె అక్షరాభ్యాసం కూడా పెద్ద పండగలా జరిపించారు. ఊరందరికీ భోజనాలు. మానసకు జరిగే వేడుకలు చూసిన అందరూ ఆడపిల్లగా పుట్టాలంటే మానస పుట్టిన ఇంటిలాంటి ఇంట్లో పుట్టాలనుకునేటట్లుగా అపురూపంగా పెరిగింది మానస.

అలా ముద్దు మురిపాల మధ్య ఇంట్లోవాళ్ళ కనుపాపలా పెరిగింది మానస. చదువులో ఎప్పుడూ ముందే ఉండేది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Manasa+Yetulortuno**

* * *